క్లుప్తంగా

విద్యాకానుకలు సకాలంలో అందేలా చర్యలు


తాళ్లరేవు హైస్కూల్‌లోని విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

తాళ్లరేవు: పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికే విద్యాకానుకలు పంపిణీ చేసేలా చర్యలు చేపడతున్నట్లు సమగ్ర శిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మండల విద్యాశాఖాధికారులతో కలిసి విద్యా కానుక స్టాక్ పాయింట్, ఐఈఆర్‌పీలు చేస్తున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వేను స్వయంగా పరిశీలించారు. దీంట్లో భాగంగా జార్జిపేట గ్రామంలో పంచికట్ల ఆనంద్‌కుమార్ ఇంటిని సందర్శించి మాట్లాడారు. అనంతరం తాళ్లరేవు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, ఎం.ఉమ, సీఆర్‌పీఎస్‌లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌లు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణపై విస్తృత ప్రచారం


మహా యజ్ఞం ఆహ్వాన పత్రాన్ని భక్తులకు అందజేస్తున్న విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వచ్చే నెల 4వ తేదీన అమలాపురంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరుతూ దేవాలయాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. స్థానిక కాలేజీ రోడ్డులోని శ్రీవిజయ త్రిముఖ గణపతి, కొంకాపల్లిలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం తదితర ఆలయాల్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆ మహా యజ్ఞంలో పాల్గొని తరలించాలని భక్తులకు పిలుపునిచ్చారు. లోక కల్యాణార్థం నిర్వహించే ఈ మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులకు వ్యక్తిగతంగా కలిగే శుభ ఫలితాలను విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు వివరించారు. సమావేశాల్లో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు పనసా బుజ్జి, గొవ్వాల అచ్యుత రామయ్య, జి.నాగరాజు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతో మానవ మనుగడ


సమావేశంలో మాట్లాడుతున్న కోలా వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం: జీవ వైవిధ్యంతోనే సకల జీవుల మనుగడ ముడిపడి ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జనిపెల్ల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగిన జన విజ్ఞాన వేదిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవుల జాతుల మధ్య జన్యుపరమైన వైవిధ్యాలు ఉంటాయన్నారు. అన్ని జీవులు బతికితేనే మనమంతా హాయిగా జీవించగలుగుతామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కాజా మొహిద్దీన్, కేవీవీ సత్యనారాయణ, ఆర్.వీరాస్వామి, బి.రామప్రసాద్, పి.రామకృష్ణారావు, పి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 152 మంది హాజరు

ముమ్మిడివరం: జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 16 సెంటర్లలో కలిపి మొత్తంగా 549 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 152 మంది మాత్రమే హాజరైనట్లు డీఈఓ ఎం.కమల కుమారి తెలిపారు. డీఈఓ ఎం.కమలకుమారి మూడు పరీక్షా కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ మూడు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ పది పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

టొబాకో మాజీ చైర్మన్ నాయుడికి మాతృ వియోగం

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన ఇండియా టొబాకో డెవలప్‌మెంట్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కొర్లపాటి బ్రహ్మానందరావునాయుడు మాతృమూర్తి సావిత్రి(90) ఆదివారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందారు. ఆమె మృతికి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు గంటి ప్రవీణ్‌కుమార్ తదితరులు సంతాపం తెలియజేశారు.

స్థానిక సంస్థల పురోగతికి

చమురు సంస్థల నిధులివ్వాలి

- మున్సిపల్ కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- టౌన్ ప్లానింగ్ వైఖరిపై ధ్వజమెత్తిన పాలక పక్ష కౌన్సిలర్లు


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, మండల పరిషత్, గ్రామ పంచాయతీల పురోగతికి ఈ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థలు తమ వంతు నిధులివ్వాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు కౌన్సిల్‌లోని 30 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కౌన్సిల్ తరపున కమిషనర్ ఎస్.మనోహర్‌కు అందజేశారు. ఇదే డిమాండ్‌ను కౌన్సిల్ తీర్మానం చేయాలని కౌన్సిలర్లు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ మనోహర్ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ అంశాన్ని వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చకు తీసుకొచ్చి కౌన్సిల్ ఆమోదించేలా చేస్తామని స్పష్టం చేశారు. మన ప్రాంతంలో లభ్యమవుతున్న డొమిస్టిక్ గ్యాస్‌ను గృహ అవసరాలకు చమురు సంస్థలు ఉచితంగా ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు. కోనసీమ భూముల్లో కార్యకలాపాలు చేస్తూ రూ.కోట్లలో ఆదాయం పొందుతున్న చమురు సంస్థలు ఈ ప్రాంతంలోని స్థానిక సంస్థలకు నిధులు విడపకపోవడంపై ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు.

టౌన్ ప్లానింగ్ వైఖరిపై పాలక పక్షం ధ్వజం

మున్సిపల్ దుకాణాల అద్దెలు చెల్లింపులు, ఆక్రమణలు, భవన నిర్మాణాల ప్లాన్‌లకు అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై పాలక పక్షానికి చెందిన కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్‌లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయం చెంతనే ఉన్న ఓ మున్సిపల్ షాపును లీజు తీసుకున్న వ్యక్తి మధ్యలో అంత అద్దె చెల్లించలేనని చేతులెత్తేస్తే ఆ లీజుదారుడిని రద్దు చేయకుండా కొత్త లీజుదారుడిని ఆమోదించాలన్న అంశాన్ని కౌన్సిల్‌కు ఎలా తీసుకొచ్చారని ప్రశ్నించారు. ఏదైనా షాపు ఓ వ్యక్తి లీజు తీసుకుంటే ఆ లీజు కాల పరిమితి ముగిసే వరకూ ఆ వ్యక్తే మొత్తం లీజు చెల్లించే నిబంధన ఉందని కమిషనర్ మనోహర్ వివరణ ఇచ్చారు. చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్‌లు చెప్పిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేయని పాలక పక్షం ఆ అంశాన్ని వాయిదా వేసింది. పట్టణంలో అక్రమ కట్టడాలపై ఇప్పటి వరకూ ఎన్ని కేసులు నమోదు చేశారన్న కౌన్సిలర్ రాజేష్ ప్రశ్నకు పట్టణ ప్రణాళిక అధికారి చిన్నా బదులిస్తూ 62 కేసులు ఉన్నాయని, కొత్తగా మరో 22 గుర్తించామని చెప్పారు. పట్టణ ప్రణాళిక విభాగం పట్టణంలో 7 సెంట్లకు మించిన భవనాలకు ప్లాన్‌కు అనుమతి ఇవ్వకూడదన్న నిబంధన ఉన్నా పద్మినీపేట ప్రాంతంలో 14 సెంట్లలో నిర్మిస్తున్న భవనానికి ఎలా అనుమతులు ఇచ్చారని కౌన్సిలర్ నాగేంద్ర ప్రశ్నించారు. దీనిపై ప్రణాళిక అధికారి సమాధానమిస్తూ తొలుత భవన యజమాని 7 సెంట్లకు ప్లాన్ అనుమతి పొందినా, మరో 7 సెంట్లకు కొత్తగా అనుమతి కోరారని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారుల సమాధానాలపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్‌ను అస్తవ్యస్తంగా తయారు చేశారని, కొత్తగా వచ్చిన కమిషనర్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే ఆ విభాగం సర్వనాశనం అవుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, యేడిద శ్రీను, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు తదితరులు పలు సమస్యలపై చర్చించారు.

నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా

సుంకరపాలెంలో మరో ఇసుక లారీ పట్టివేత


సుంకరపాలెం జాతీయ రహదారి వద్ద ఎస్‌ఈబీ పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

తాళ్లరేవు: నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మరో లారీని ఎస్‌ఈబీ అధికారులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, ఆంధ్రా సరిహద్దులో కొంతమంది జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. ఆంధ్రా బిల్లులు చూపించి యానాంలో ఇసుకను విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం సెంటర్‌లో ఎస్‌ఈబీ అధికారులు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మరో లారీని పట్టుకున్నారు. ధవళేశ్వరం నుంచి ఇసుకను తెచ్చినట్లు చెబుతున్నా బిల్లులు నకిలీవని తేలడంతో లారీని సీజ్ చేసి కోరంగి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్‌ఈబీ, కోరంగి పోలీసులు హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపు రోజున పోలీసులకు సహకరించాలి


శ్రీరామపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక శ్రీరామపురంలో సోమవారం సాయంత్రం ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజున ఎవరూ ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. పార్టీల ప్రభావం, అభ్యర్థులపై అభిమానం పోలింగ్ వరకూ మాత్రమే ఉండాలని, అందరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. మీ ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విద్రోహశక్తుల ఉనికి తెలిస్తే ఆ సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు. సదస్సులో పట్టణ ఎస్ఐ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీ వేగవంతం చేయాలి


విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ భీమారావు

అమలాపురం రూరల్: పాఠశాలల వారీగా విద్యా కానుక పంపిణీ వేగవంతం చేయాలని కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు అన్నారు. అమలాపురం మండలానికి సంబంధించి బండారులంక హైస్కూల్‌లో ఉన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. పాఠశాలల వారీగా విద్యా కానుక పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని సీఆర్పీలు, ఉద్యోగులను ఆదేశించారు. సీఆర్పీల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఐఈవో గుబ్బల సూర్యప్రకాష్, మండల విద్యాశాఖాధికారి సరేళ్ల దుర్గాదేవి, సీఆర్ఎంటీలు జి.నాగన్న, అనూష, శ్రీనుబాబు, నాగ మల్లేశ్వరరావు, కుమారి, శ్రీనుబాబు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి వర్ధంతి


రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల జై బుద్ధ పార్కులో సోమవారం రమాబాయి 89వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమాబాయి జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి, ఐఎన్ మల్లేశ్వరరావు, పెనుమాల చిట్టిబాబు, ఎం.ఆశీర్వాదం, దోనిపాటి ఆంజనేయులు, కాశి సింహాద్రివర్య, పీవీ చక్రవర్తి, కాశి సత్యనారాయణమూర్తి, బుడితి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులను పరిశీలించిన అధికారుల బృందం


గోవలంక ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా అధికారుల బృందం

తాళ్లరేవు: మండల పరిధిలోని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపులను జిల్లా మైనింగ్, భూగర్భ జలాలు, పంచాయతీ అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. ఎటువంటి అనుమతులు లేని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపుల్లో ఇసుక ఎగుమతులు చేయరాదంటూ జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఇటీవల హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొంతమంది అక్రమార్కులు ఆ హెచ్చరికలను బేఖాతర్ చేసి ర్యాంపుల్లో రహదారులను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో అధికారులు నరసింహారెడ్డి, రాధాకృష్ణ, సౌజన్య తదితరులు స్వయంగా ర్యాంపులను పరిశీలించి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొబ్బరి ఎగుమతుల కోసం రైతులు ర్యాంపు రహదారిని పునరుద్ధరించారని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీనిపై స్పందిస్తూ ఇసుక ర్యాంపుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా చూడాలని జిల్లా మైనింగ్ అధికారి నరసింహారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం ఇసుక ర్యాంపులను తనిఖీ చేస్తామని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట కాలుష్య నియంత్రణ మండలి అధికారి ప్రశాంతి, ఎస్ఈబీ డీఎస్పీ ఏఎస్ దొర, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్రన్ డ్యాన్స్‌తో అదరగొట్టిన చిన్నారులు


పోటీల్లో వెస్ట్రన్ డ్యాన్స్‌తో అలరిస్తున్న చిన్నారులు

అమలాపురం టౌన్: స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరుగుతున్న రోటరీ యువజన వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన వెస్టర్న్ డ్యాన్స్ పోటీల్లో చిన్నారులు మెరిసేటి డ్రెస్సులు, అదిరేటి స్టెప్పులతో అలరించారు. దాదాపు 60 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. డ్యాన్స్ మాస్టర్ ధనరాజ్, మాస్టర్ చాణక్య పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన చందు ఈ పోటీలకు విశిష్ట అతిథిగా పాల్గొని వీక్షించారు. రోటరీ యువజన వారోత్సవాల కమిటీ చైర్మన్ ఆకొండి వపన్, అమలాపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి నాగభూషణం, కార్యదర్శి శ్రీఘాకోళపు రామ సతీష్, కోశాధికారి కూచిమంచి శశిధర్ శ్రీరామ్ తదితరుల ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతున్నాయి.

కౌంటింగ్ ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేయాలి

యానాం: వచ్చే నెల 4న పట్టణంలో జరగనున్న పుదుచ్చేరి పార్లమెంటరీ స్థానానికి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారి జవహర్, రిటర్నింగ్ అధికారి కుళొత్తుంగన్ ఆదేశించారు. సోమవారం ఆయన పుదుచ్చేరి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, 8.30 గంటల నుంచి ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ హాల్లోకి మొబైల్ ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించొద్దన్నారు. కౌంటింగ్ సిబ్బందికి సోమవారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు భద్రత నడుమ ఓటు హక్కు వినియోగం


పోలీసు భద్రత నడుమ ఓటు హక్కు వినియోగించుకున్న లలితకుమారి కుటుంబం(ఫైల్)

అమలాపురం టౌన్: వ్యక్తిగత వివాదం దృష్ట్యా తాము ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలంటూ పట్టణంలోని దుడ్డివారి అగ్రహారంలోని ఓ కుటుంబం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దుడ్డివారి అగ్రహారానికి చెందిన లలితకుమారి కుటుంబానికి, స్థానికుల మధ్య రహదారి విషయమై వివాదం నడుస్తోంది. దీంతో ఆ కుటంబాన్ని ఆ రహదారి మీదుగా వెళ్లకుండా కొందరు అడ్డుకుంటారన్న ఆందోళనతో కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని ఫిర్యాదులో బాధిత కుటుంబం వేడుకుంది. ఈ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల పరిశీలకునికి పంపించింది. దీంతో ఆ బాధిత కుటుంబానికి ఈ నెల 13న పోలీసులు రక్షణగా ఉండి ఆ ప్రాంత పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని స్థానిక పోలీసులు వీడియో రికార్డింగ్ చేసి భద్రపరిచారు.

డీఏ పెంపు ఉత్తర్వుల జారీ

యానాం: మున్సిపల్ ఉద్యోగులకు 25 శాతం డీఏ పెంచుతూ లోకల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి ఆర్.రతన్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పెంపు ఉత్తర్వులు ఈ ఏడాది జనవరి 1 నుంచి యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లో అన్ని మున్సిపాలిటీ, కమ్యూన్ పంచాయతీల సిబ్బందికి వర్తిస్తుందన్నారు. అదేవిధంగా సీలింగ్ ఆన్ రిటైర్‌మెంట్, డెత్ గ్రాట్యూటీ సైతం 25 శాతానికి, ట్రావెలింగ్ ఎలవెన్స్ 25 శాతం, హెచ్ఆర్ఏ 30 శాతం, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ ఎలవెన్స్ నెలకు రూ.2,250, హాస్టల్ సబ్సిడీ రూ.6,750, దివ్యాంగులైన పిల్లలకు నెలకు రూ.4,500 ఇవ్వనున్నారు. ఈ ఖర్చులన్నీ ఆయా మున్సిపాలిటీల సొంత నిధుల నుంచి ఖర్చు చేసుకోవాలన్నారు.

గోడిలంకలో మెగా వైద్య శిబిరం


గోడిలంకలో మెగా వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అల్లవరం: ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణలో గోడిలంక పంచాయతీ వద్ద సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు అధ్యక్షతన జరిగిన వైద్య శిబిరంలో హైపర్ టెన్షన్‌పై అవగాహన కల్పించారు. శిబిరంలో రోగులకు ఈసీజీ, ఆర్‌బీఎస్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అనిల్‌కుమార్, నడింపల్లి వెంకటరామరాజు, జంపన సుమన్‌వర్మ, జీవీఎస్ మల్లిబాబు, చిక్కాల సతీష్, పి.వెంకటరమణ, గుమ్మళ్ల అచ్యుతరామయ్య, గంటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు


వేసవి శిక్షణా శిబిరంలో బహుమతులు పొందిన చిన్నారులు

ఐ.పోలవరం: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మురమళ్లలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. శిక్షణా శిబిరంలో సుమారు 270 మంది విద్యార్థులకు కంప్యూటర్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలపై అవగాహన, యోగా, గణితంలో మెళకువలు, స్టోరీ రైటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైర్రాజు ఫౌండేషన్ గ్రామవికాస సమితి కన్వీనర్ జంపన బాబు, మాజీ సర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబు, కోఆర్డినేటర్ తాడినాటిఫణీంద్ర సత్యగణేష్ పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి, భూవరాహ స్వామి హోమాలు


లక్ష్మీగణపతి, భూవరాహ స్వామి హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీగణపతి, భూవరాహ స్వామి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మశ్రీ కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో ఈ హోమ క్రతువు జరిగింది. తొలుత స్వామి, అమ్మ వార్లకు ఏకాదశ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వీరబాబు, పంచాయతీ సెక్రటరీ ఆర్ఎస్ఎస్ సూరపరాజు, ఎంపీటీసీ అంకం హిమ భారతి, చందన బ్రదర్స్ మేనేజర్ శ్రీధర్, పిచ్చుక శాంతి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దంగేటి బుల్లబ్బులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి స్వామి, అమ్మ వార్లకు సుగంధ భరిత పుష్పాలతో, వివిధ రకాల స్వీట్లతో ప్రత్యేకంగా అలంకరించిన పానుపుపై స్వామి, అమ్మవార్ల పవళింపు సేవ సంప్రదాయబద్ధంగా జరిగింది.

పాఠశాలల ప్రారంభం రోజునే పుస్తకాల అందజేత

యానాం: పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖ అధికారులు సోమవారం ప్రకటించారు. సీబీఎస్ఈ సిలబస్ అమలు నేపథ్యంలో విద్యార్థులకు ఇచ్చేందుకు గాను ఇప్పటికే 14.50 లక్షల నోటు పుస్తకాలను కొనుగోలు చేశామన్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంను సైతం సిద్ధం చేస్తున్నామన్నారు. పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నామని, నోటు పుస్తకాలు త్వరలో వస్తాయని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలి


విద్యార్థులతో క్యారమ్స్ ఆడిస్తున్న గ్రంథాలయాధికారి శేషుకుమార్

ఉప్పలగుప్తం: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలకు విచ్చేసి వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకుని క్రమశిక్షణ అలవరుచుకోవాలని గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని భీమనపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా నీతి కథలు, సమయస్ఫూర్తితో కూడిన ఆటలను నేర్పించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవరుచుకోవాలని గ్రంథాలయాధికారి శేషుకుమార్ సూచించారు.

పనులు పరిశీలించిన సీఈ దీనదయాళన్

యానాం: పుదుచ్చేరి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ దీనదయాళన్ సోమవారం యానాంలో పర్యటించి పీడబ్ల్యూడీ శాఖాపరంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా 55 ఎకరాల తాగునీటి చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం అక్కడ నుంచి తీర గ్రామాల్లో చేపడుతున్న పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.